# 29

# కొండసిగలో గోగుపూలు

(కథాకాలం 1987)

ఎవరో పిలిచినట్టయి లేచికూర్చున్నడు సుక్కు. కళ్ళు నులుముకుని అటుయిటు చూసిండు.

అంతా నిశ్శబ్దంగా వున్నట్టుంది. ఏ అలికిడి లేదు.

ఆవలింతలుతీసి చిటికెలువేస్తూ అవతలికి నడిచిండు. చల్లగాలి ముఖంమీద ఒక్కసారిగా చరిచింది. నిద్రమత్తు వదిలింది. మసక చీకటిలో అడివికేసి చూసిండు.

రాత్రంతా వర్షం పడీపడీ అపుడే తగ్గుతున్నట్టుంది. చెట్ల కొమ్మలు నీటికి తడిసి ఆకుల్తో బరువుగా వంగిపోయినయి. ఆకుమీంచి ఆకుపై రాలుతున్న చినుకులు టపటపమంటున్నయి. కాళ్ళకింద మట్టి మెత్తగా నానింది. తుంపర చినుకులు...

ఒంటేలుకు పోయిండు. ఆకాశంకేసి చూసిండు. ఎక్కడో ఏవో చుక్కలు అలా కన్పించి మాయమయినయి. అంటే తెల్లవారడానికి యింకా రెండు గంటలుందన్నమాట! అనుకున్నడు సుక్కు.

ఇంతరాత్రి ఏమిటి చేయడం! చల్లనిగాలి... తుంపర చినుకులు... పెయి చల్లబడిపోయింది. ఇక నిద్ర రాదు. కళ్ళు చీకటికి అలవాటుపడ్డట్టున్నయి. కాళ్ళు అలవాటుగా పొలంవైపు నడిచినయి.

పొలంనిండా నీళ్ళు... పాలుపొంగినట్టుగా నీళ్ళు. ఏతంబావికేసి చూసిండు. పరుచుకుని పారుతున్న నీళ్ళల్లో బావి కన్పించలేదు. ఆ మూలన నీళ్ళు మెలికలు తిరుగుతున్నయి. సున్నితంగా నీళ్ళ సవ్వడి... ఎక్కడో ఏరు పారుతున్నట్టుంది. ఎవరో శ్రావ్యంగా పాట పాడుతున్నట్టున్నరు. గాలి అలలపై తేలియాడుతూ వస్తున్నది పాట.

'హమ్మయ్య'! ఇలాంటి వర్షాలు ఇంకో నాలుగు చాలు. తమ దరిద్రం వదులుతుంది. ఎవరి దయ అవసరం లేదు అనుకున్నడు సుక్కు.

కాళ్ళు గుడిశెలోకి నడిచినయి. సుక్కు విత్తనాల వడ్లగంప వద్ద ఆగిపోయిండు. అంతలోనే ఆ ఆలోచనకు నవ్వొచ్చింది. 'ఉరికి ఉరికి పశువుల మేపితే పొద్దు తొందరగా గుంకుతుందా?' మళ్ళీ బయటకు నడిచిండు సుక్కు. చూరుపక్కనున్న మద్ది మొద్దు మీదకూర్చున్నడు. చూరునీళ్ళు తలలో టపటప రాలినయి.

మెరుపు మెరిసినట్టయింది. ఆ మెరుపులో అడవి ఉరిసిన గుడిసెలా వుంది. తడిసిన బుర్ర మెరిసినట్టయింది. ఎందుకు తెలివిడి పడిందో సుక్కుకు అర్థమైనట్టుంది. ఆ పిలిచిందెవరో తెలిసినట్టుంది. కల పడి తెలివైనట్టుంది.

అది కలా! నిజమా! లేక తన ఆలాపనా! కాదు నిజమే. తానే అన్న అని పిలిచిండు. తనకోసం ఆగమని పిలిచిండు. వారి వెనక పరిగెత్తుతున్నడు. వాళ్లు తన పిలుపు విన్నరు. అక్కడే నిలబడి అన్నరు. పరిగెత్తకు పడుతవు జాగ్రత్త అని నిదానంగా రమ్మన్నరు. ఇది నిజం! నిజం అయితే యిక్కడెందు'కున్నడు తాను? అనుకున్నడు సుక్కు.

అవునూ! అన్నలు నిన్ననే వచ్చి పోయిన్రు కదా! అన్నలు ఆ మాట అన్నప్పటినించీ అదే ఆలోచన, అదే ఆలాపన! కునుకు ఎప్పుడు పట్టిందో! కల ఎప్పుడువచ్చిందో! కలలో అన్నలు ఎంత కళగా కన్పించిన్రో! గంభీరమైన ముఖాలు, ఆ ముఖాల్లో ప్రసన్నత, నిండైన డ్రెస్సు, నిలువెత్తు ఆయుధం. ఆ కళ్ళల్లో ఎంత కాంతి! ఆ అక్కల్లో ఎంత ధైర్యం!.

అవునూ! ఈ అన్నల రాకవల్ల తమ జీవితాల్లో ఎంత మార్పు వచ్చిందో! అన్నలు తమ పల్లెల్లో ప్రవేశించి అపుడే మూడేళ్ళయిపోయింది! తమ జీవితాలు మారిపోయి మూడేళ్ళయింది! అన్నలు రాకముందు తమ జీవితాలు ఎలా వుండేవి? తాను పుట్టడం, వయసు పెరగడం, అన్నకు పెండ్లి. వదినకు యిద్దరు పిల్లలు, అక్కలకు బావలు, వాళ్ళకు పిల్లలు, ఆ పిల్లలకు పిల్లలు, పిల్లలు తల్లులవడం, అలా ఒక యిల్లు పల్లెంతగా పెరగడం. అంతకు తప్ప ఏ మార్పు వుండింది?.

ఎవరికీ కట్టుబట్టలు లేనికాలం అది. అన్న కొనుక్కున్న అంగడి బనియన్, నిక్కరుతో ఏళ్ళు వెళ్ళదీసిండు. వదిన చుట్టుకునే తువ్వాలే చీరగా ఎంత కాలం గడిపిందో! తానైతే పల్లెచుట్టూ వున్న గుట్టలే అంగీ లాగులుగా ఎన్నేండ్లు గడిపిండో! చినిగి చిన్నదైపోయిన అన్న డ్రెస్సే తనకు కొత్త డ్రెస్సు.

చలికాలం కప్పుకోవడానికి బట్టలు... కంద ఆకులు, పైన గుడిసె. పొలం పండితే తిన్నట్టు లేకుంటే ఎండినట్టు. ఎంత మంచి పొలం కాజేసిన్రు ఫారెస్టు వాళ్ళు. ముగ్గురం ఎంతో కష్టపడి పొరకంత నరికిన పొలం! అంతేనా? ఆకు తెంపినా అధికారం చెలాయించిన్రు. కల్లు, కోడి కావాలన్నడు గార్డు. తాను అన్నా పనిమీద పోయిన్రు. ఒంటరి వదిన భయపడిపోయింది. ఇద్దామన్నా యింట్లో ఏమీలేదు. ఇదే అదునని వదినను... గతమంతా గుర్తుకువస్తున్నది.

ఆకలి తీరడం కోసం ఎంత పోరాటం...! అంబలి బతుకులు... అది తప్పితే ఏరు నీళ్ళు... ఇలాంటివే తప్ప ఏం మారింది బతుకు? తునికాకు సీజన్లో ఎంత వెట్టి... ఎంత అన్యాయం...? అన్నలు రాకపోతే తమ బతుకులు యింకా యిలాగే తెల్లవారేవేమో.

అన్నలు వచ్చిన్రు. తమకు ఎన్నో వచ్చినయి. ధైర్యం వచ్చింది. దైన్యం పోయింది. తమ నోట్లోకి నాలుక వచ్చింది. వడ్డీ తగ్గింది. సంగం వచ్చింది. లంచాలు పోయినయి. అన్నిటికన్నా అసలైంది తమ జీవితాలే మారిపోయినయి. కొత్త కొత్త మాటలు... కొత్త కొత్త పాటలు... కొత్త కొత్త ఆలోచనలు... కొత్త కొత్త జీవితాలు... ధైర్యంగా తనలో తాను నవ్వుకున్నాడు సుక్కు.

అవును! ఇకనుంచి తాను కూడా అన్నలతో కలసిపని చేయాలె. ఈ దొరల రాజ్యం, దోపిడీ రాజ్యం కూల్చాలె. తమ రాజ్యంకోసం తాను కూడా యుద్ధం చేయాలె.

అదేమిటి? అన్నలు తన దీక్షను అనుమానించిన్రు. అలా తనను అవమానించిన్రు. కాకపోతే అదేమిటి? ఇంకా కొద్దిరోజులు ఆలోచించు కొమ్మంటరా!అదేం కుదరదు. ఈ రోజే పోవాలె. అన్నల్తో కలవాలె. అన్నల్లో కలవాలె.

అరె! ఇంకా తెల్లారదేమి? ఇదేం వర్షం?

సుక్కు అన్న సోమన్న లేచినట్టున్నడు. తమ్ముడి వాలకం చూసిండు. వర్షంలో తడుస్తూ ఇక్కడ కూర్చున్నావేమని అడిగిండు. అందుకు మౌనమే సమాధానమైంది. ఏదో అర్థం చేసికొన్న వాడిలా మళ్ళీ అడగలేదు సోమన్న.

తెలతెలవారుతోంది. నీరు తేటపడ్తున్నట్టుంది. సోమన్న కట్టతెంపి పొలంలోని నీళ్ళు పోనిచ్చిండు. అన్నాతమ్ములు పొలంపనిలో పడ్డరు.

వదిన లేచింది. తవుడూ నూకలు పిండిచేసింది. అంబలి కాచింది.

ఆకుదొప్పల్లో తలాయింత అంబలి తాగిన్రు. వదిన కూడా పొలంలో దిగింది. పిల్లలు బురదమట్టిలో ఆడుతున్నరు. అరువు తెచ్చిన ఎడ్లతో ఆపూటకే పని పూర్తవ్వాలని సోమన్న ఆరాటం. కానీ రంధి పెట్టుకున్న తమ్ముడో – అని తపన.

ఆ పూటకే పని పూర్తిచేయాలని ఆరాటం. ఆ వెంటనే అన్నల జాడకు పోవాలని సుక్కు ఆలోచన.

ఆపూట గడిచింది. తమ్ముడి హుషారుకు ఆశ్చర్యపోయిండు సోమన్న.

ఈ పంట రాంగనే వీడి పెళ్ళి చేస్తే అన్నలన్న ఆలోచన వదిలి పల్లెలో ఉండకేం చేస్తడు? తానుండడంలేదా! అన్న సోమన్న ఆలోచన అలా సాగింది.

సుక్కు ఆలోచన మరో తీరు సాగింది. ఇంతదాకా వాళ్ళు అన్నలు. తాము ఆదివాసులు. ఇపుడు తాను అన్నల్లో కలిస్తే తామే అన్నలు – అన్నలే తాము. తమ చేతుల్లో తుపాకులు. తమ చేతుల్లోకి రాజ్యం... తమదే రాజ్యం. వదిన కూడా ఎంత మురిసిపోయిందో! అన్నలే మళ్ళా ఆలోచించుకొమ్మన్నరు.

ఇంకా ఏం ఆలోచన? వెనక్కి పోయేటోనికి మరో ఆలోచన, ముందుకే పోవాలనుకునే తనకెందుకు ఆలోచన!.

అలా ఆలోచిస్తూ అలసట మరిచిండు సుక్కు.

అరే! అపుడే పని పూర్తయిపోయిందా!

ఆశ్చర్యపోయిండు సోమన్న.

అలా పోయి వస్త! అని అడవిలోకి నడిచిండు సుక్కు.

అదే పోవుడు.

❄ ❄ ❄

రాత్రంతా అన్నా వదిన ఎదురుచూసిన్రు. అక్కడక్కడ వెతికిన్రు. అయినా సుక్కు జాడ తెలియదు.

నెల రోజులగ్గానీ సుక్కు తిరిగి రాలేదు. అప్పటికే సుక్కు మారినట్లున్నడు. అన్నల్లో అన్నగా వచ్చిండు సుక్కు. అన్నల్తో అన్నగా వచ్చిండు సుక్కు. ఆనవాయితీగా హెచ్చరించింది సంగం. అన్నల్లో కలవడం అంటే సుక్కల్లో కలవడం.

సూటిగా పోలీసు తూటాలు ప్రాణాలే తీయవచ్చు.

పెళ్ళిమీదకు మనసు పోయి మళ్ళీ యిటే రావచ్చు.

పొయ్యి అంటిస్తే పొగచూసి పోలీసులు రావచ్చు.

పొడి గడకే బుక్కాల్సి రావచ్చు.

నిద్రవస్తున్నపుడే నిన్ను వెంబడించవచ్చు.

మీ అన్న సంగతి, వదిన సంగతి ఆలోచించు. అన్నీ ఆలోచించు. మన పల్లె గురించి ఆలోచించు అన్నరు.

వాళ్లు అన్నవేవీ సుక్కుకి కొత్తకాదు. వినివిని విసిగిపోయిండు.

అలా భయపడితే అన్నలెలా పనిచేయగలరు?

అడివంటే ఏమిటో తెలియని అన్నలు ఏ ధైర్యంతో వచ్చిన్రు. అడవిలో పుట్టిన తాను అడవిలో తిరగడానికి ఏమిటి? తమకోసం దూరంనుండి ప్రాణాల్విడానికి వచ్చిన్రు వీళ్ళు. తమకోసమే తన ప్రాణం యివ్వడానికి ఏమిటి తనకు... అనుకున్నడు సుక్కు.

అందుకే అన్నలిచ్చిన డ్రెస్సు వేసుకున్నడు సుక్కు. అన్న చేతి తుపాకీని ఆప్యాయంగా తీసుకున్నడు. తనలో ఏదో అనిర్వచనీయ ఆనందం. ఆ డ్రెస్సులో చూసి పల్లెలో అందరూ మురిసిపోయిన్రు. మరిదిని చూసి వదిన సంతోషంగా దీవించింది.

మీటింగ్ అయిపోయింది. అన్నలు అన్నాలు తినుడు అయిపోయింది. అన్నలతో లేచిండు సుక్కు. అందరికీ 'లాల్ సలాం' అన్నడు. వాళ్ళు కన్పిస్తున్నంత దూరం కన్నీళ్ళతో చూసింది పల్లె. అన్నలు అలా ముందుకు సాగుతూనే ఉన్నరు.

ఇపుడు సుక్కు ఆదివాసీ మాత్రమే కాదు.

ఆదివాసుల్లో అన్నగా ఎదిగిండు.

అడవిలో ఆయుధం అయ్యిండు.

అడవిని సాయుధం చేస్తున్నడు సుక్కు.

**కథాకాలం 1987, రచనా కాలం 1988.**

**అరుణతార మాసపత్రిక, మే, 1990.**